క్లుప్తంగా

త్రిశక్తి అమ్మవార్లకు అష్టోత్తర కలశారాధన



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో బుధవారం మహాలక్ష్మి, మహాదుర్గ, మహాసరస్వతి అమ్మవార్లకు అష్టోత్తర కలశారాధన చేశారు. ఆలయ 18వ వార్షికోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవార్లకు పంచామృత నవరస అభిషేకం చేశారు. సాయంత్రం రుత్వికులు మూలమంత్ర విశేష హోమం, నవగ్రహ, నక్షత్ర హోమాలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



గుడివాడ అప్పన్నకాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: క్షయ వాధిపై అవగాహన కలిగి ఉండాలని 68వ వార్డు యూసీహెచ్‌పీ వైద్యాధికారి డాక్టర్ అనూష అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి వారోత్సవాల్లో భాగంగా బుధవారం గుడివాడ అప్పన్నకాలనీలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులకు సిబ్బంది టీబీ లక్షణాలను వివరించారు. ఎక్కువ రోజులు దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉండే క్షయ వ్యాధి కావచ్చని వెంటనే సమీపంలోని యూపీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉచింగాత మందుల అందజేసి వ్యాధి నివారణ చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ వి.అనిల్ కుమార్, హెచ్ఎస్ కనకారావు, టీడీహెచ్‌వీ రాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ శీలానగర్ ఫీడర్, 11 కేవీ వెంకటేశ్వరకాలనీ ఫీడర్, 33/11 కేవీ శీలానగర్ సబ్ స్టేషన్‌లో అభివృద్ధి పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ ఈఈ బి.కె.నాయుడు బుధవారం తెలిపారు. శీలానగర్, బీహెచ్‌పీవీ క్వార్టర్స్, గవరజగ్గయ్యపాలెం, దుర్గా కాలనీ, కుమ్మీ లేఅవుట్, నెక్స్‌ట్రా అపార్ట్‌మెంట్ ఏరియా, వెంకటేశ్వరకాలనీ, కిమ్స్ ఐకాన్ హాస్పటల్ ఏరియా, రిజిస్ట్రార్ ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

రక్తదాతా.. సుఖీభవ



రక్తదానం చేస్తున్న అనిల్‌కుమార్

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ అధికారి డీవీ అనిల్‌కుమార్ బుధవారం 88వ సారి రక్తదానం చేశారు. స్టీల్‌ప్లాంట్ ఇంటర్నల్ ఆడిట్ అండ్ స్టాక్ వెరిఫికేషన్ విభాగానికి చెందిన సీనియర్ మేనేజర్ అనిల్‌కుమార్ మొదట నుంచి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. 1987 నుంచి రక్తదానం చేస్తున్నారు. కాగా అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏడాదిన్నర బాలుడికి రక్తం అవసరం పడింది. సమాచారం తెలిసిన అనిల్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఆయన్ను ఉక్కు అధికారులు అభినందించారు.

ప్రపంచ స్థాయి విద్యను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ నాగేశ్వరరావు

అగనంపూడి: ప్రపంచ స్థాయి విద్య, పరిజ్ఞానం పొందినప్పుడే మంచి అవకాశాలు లభిస్తాయని ఎన్ఆర్ఐ డాక్టర్ డి.నాగేశ్వరరావు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు విదేశీ విద్యావకాశాలు, స్కాలర్‌షిప్‌లు, వివిధ కోర్సులపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత తరుణంలో విదేశాల్లో చదువులతోపాటు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. భారతీయ యువతకు మంచి గిరాకీ ఉందని చెప్పారు. విద్యార్థులు వాటిని అందుకునే దిశగా ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, ఎంబీఏ ప్రొఫెసర్ ఎస్.ఎం.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా.. మన్నించు!



పార్కులోపల కానరాని పచ్చదనం



మందుబాబులు తాగిపడేసిన గ్లాసులు, సీసాలు

ఆకతాయిలకు అడ్డాగా గాంధీ పార్కు

కానరాని పచ్చదనం

పట్టించుకోని అధికారులు

చీకటి పడితే మందుబాబుల చిందులు



గాంధీపార్కులో అధ్వానంగా ఉన్న సిమెంట్ బెంచీలు

పెదగంట్యాడ: ఆహ్లాదం పంచాల్సిన పార్కు కళావిహీనంగా తయారైంది. మండలంలోని నడుపూరు గాం. దీపార్కు ఆకతాయిలకు అడ్డాగా మారింది. దీంతో పార్కు పేరు చెబితే స్థానికులు హడలెత్తిపోతున్నారు. గ్రామం నడిబొడ్డున ఉన్న ఈ ఉద్యానవనం కాస్తా చీకటి పడితే చాలు మందుబాబుల విలాసాలకు వేదికగా మారింది.వారు మత్తులో చిందులు వేయడంతో చీకటి పడిన తర్వాత అటువైపు వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. అంతేకాకుండా పచ్చదనంతో కళకళలాడాల్సిన పార్కు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది.

నిరుపయోగంగా ఓపెన్ జిమ్

నిర్వహణలేక పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది. అయినా ఇటు జీవీఎంసీ అధికారులు, అటు ఉద్యానవన సిబ్బంది గానీ పూర్తిగా పట్టించుకోవడం మానేశారు. ఆలనాపాలన కరవు కావడంతో మొక్కలు కూడా ఎండిపోయాయి. నిత్యం పార్కులో పందులు తిష్ట వేస్తున్నాయి. ఉన్నది ఒకే ఒక్కపార్కు.. అయినా దానిని పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతంలో కనీసం కూర్చోవడానికి కూడా వసతి లేని పరిస్థితి నెలకొంది. అయినా అధికారులు ఎవరూ పార్కు వైపు చూడకపోవడం గమనార్హం.

పరిసరాలు దయనీయం

మందుబాబులు అక్కడే తిష్ట వేయడంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు పార్కువైపు వెళ్లలేని దుస్థితి నెలకొంది. పార్కులో అసభ్య కార్యక్రమాలతో పాటు మల, మూత్ర విసర్జన కూడా చేయడంతో ముక్కుపుటాలు అదిరిపోయేలా దుర్వాసన వెదజల్లుతోంది. మద్యం సేవించిన తర్వాత ఖాళీ సీసాలను పగులగొట్టడంతో అందులో అడుగుపెట్టే వారికి గుచ్చుకుంటున్నాయి. గతంలో లక్షలాది రూపాయలు నిధులు కేటాయించి పార్కును అభివృద్ధి పరచాలని యోచించారు. అయితే పనులను తూతూమంత్రంగా చేపట్టి మమ అనిపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పిల్లలు ఆడుకునే విధంగా ఆట పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు మొక్కలు నాటాలని విన్నవిస్తున్నారు. ఆకతాయిలకు చెక్ పెట్టి పార్కును పరిశుభ్రంగా ఉంచేలా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పార్కులోకి వెళ్లలేం



గాంధీపార్కులో అడుగు పెట్టాలంటే భయమేస్తోంది. పిల్లలను కూడా పంపలేకపోతున్నాం. మందుబాబులు మద్యం సేవించి అక్కడే సీసాలు పడేస్తున్నారు. గాజుపెంకులు గుచ్చుకుంటున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– కొండకంది రాజు, నడుపూరు

నిర్వహణలో నిర్లక్ష్యం



నడుపూరులో ఉన్న ప్రధాన పార్కు ఇది. దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆహ్లాదానికి చోటు లేకుండా పోయింది. ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోకపోవడం దారుణం. అధికారుల స్పందించి వెంటనే పార్కును అభివృద్ధి చేయాలి.

– బెల్లాల పెంటిబాబు, నడుపూరు.

సైకిల్‌యాత్రకు ఘన స్వాగతం



సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న మాజీ సైనిక ఉద్యోగులు

అగనంపూడి: సీఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 6550 కిలోమీటర్ల సైకిల్ యాత్ర చేపట్టిన సీఐఎస్ఎఫ్ జవాన్లు, అధికారుల బృందానికి అగనంపూడి వద్ద ఘన స్వాగతం లభించింది. అగనంపూడి ప్రాంతానికి చెందిన శ్రీపైడిమాంబ మాజీ సైనిక ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్రకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఆహార పొట్లాలు, శీతల పానీయాలు అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాతు శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఐఎస్ఎఫ్ స్థాపించి 56 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సైకిల్ యాత్ర చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ యాత్ర నిరాటంకంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ నిర్వాసిత సంఘం నాయకులు కర్రి దశేంద్ర, మాజీ సైనికోద్యోగుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ప్రజల హృదయాల్లో వైఎస్సార్‌కు స్థానం'

అగనంపూడి: కోట్లాది మంది తెలుగు ప్రజల గుండెల్లో గుడికట్టుకున్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును తుడిపేయాలనుకుంటే మట్టికొట్టుకుపోయి.. చరిత్ర హీనులుగా మిగిలిపోతారని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు గున్నంటి పూర్ణానందశర్మ (పూర్ణ) ఆగ్రహం వ్యక్తం చేశారు. అగనంపూడిలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పేరు మార్చడం కోసం కూటమి ప్రభుత్వం కుట్రలు మానుకోవాలని హితవుపలికారు. అలాకాకుండా స్టేడియంకు వైఎస్సార్ పేరు తొలగిస్తే ప్రజల దృష్టిలో దోషులుగా నిలబడాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యలమంచిలి చిన అప్పారావు పాల్గొన్నారు.

6 నుంచి వెంకన్న ఆలయ వార్షికోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

కూర్మన్నపాలెం: వడ్లపూడి లక్ష్మీపురం కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా వచ్చేనెల 6 నుంచి 12వ తేదీ వరకు వివిధ పూజలు నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ మేరకు వార్షిక బహ్మోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు అంశాలను ఆలయ కమిటీ పెద్దలు వివరించారు. 6న కల్యాణ మహోత్సవం, 7న చిన్న శేషవాహన సేవ, 8న సూర్యప్రభ వాహన సేవ, 9న విశ్వవాహన సేవ, 10న గరుడ వాహన సేవ, 11న హనుమ వాహన సేవ, 12న రథోత్సవంతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రామరాజు, మధువర్మ, నారాయణరాజు, సతీష్ , అప్పలరాజు, ప్రధాన పూజారి నర్సింహాచార్యులు, వరహాల బాబు, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: రంజాన్ మాసం సందర్భంగా 68వ వార్డు రాంనగర్ మస్జీద్ ఈ రహమానియాలో బుధవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి హాజరై ముస్లిం సహోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మస్జీద్ ప్రతినిధులు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కబరస్తాన్ కేటాయించారని, కానీ అభివృద్ధి ముందుకు సాగలేదని వివరించారు. దీనిపై దేవన్‌రెడ్డి స్పందిస్తూ కబరిస్తాన్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. విందులో కార్పొరేటర్ ఇమ్రాన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గుడివాడ లతీష్, మైనార్టీ సెల్ నాయకులు బర్కత్ అలీ, ఎండీ గౌస్, వార్డు ముస్లిం సెల్ నాయకులు సయ్యద్ హుస్సేన్ బ్రదర్స్, మస్జీద్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఉక్కు ఆస్పత్రి జనరల్ మేనేజర్ సారంగికు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. నాయకులు బుధవారం ఉక్కు జనరల్ ఆస్పత్రి జనరల్ మేనేజర్ డాక్టర్ సారంగిని కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మందులు, వైద్యుల కొరత తీవ్రంగా ఉందన్నారు. అదే విధంగా నర్సులు, అటెండెంట్లు లేకపోవడం వల్ల రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్లు తక్కువగా ఉండటం, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ వైద్యులు లేకపోవడం వల్ల ఉద్యోగులు బయట ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందన్నారు. రోగులకు సకాలంలో మంచి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని, అన్ని మందులు డిస్పెన్సరీలో అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్, చీఫ్ పేట్రన్ నీరుకొండ రామచంద్రరావు, రమణమూర్తి, ఎస్.ఎ. నాయుడు, ప్రభాకరెడ్డి, బి.టి. జగదీష్, కోరిబిల్లి అప్పారావు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి



స్టీల్‌ప్లాంట్ ఆపరేషన్స్ డైరెక్టర్ సలీంతో సమస్యలపై చర్చిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు కోరారు. యూనియన్ నాయకులు బుధవారం డైరెక్టర్ (ఆపరేషన్స్) సలీం జి పురుషోత్తమన్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. కార్మికులు కష్టించి పనిచేసి నూరు శాతం ఉత్పత్తి సాధించడం ద్వారా పరిశ్రమను పురోభివృద్ధిలో నడిపిస్తున్నారన్నారు. తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి డి.వి. రమణారెడ్డి, అధ్యక్షుడు కర్రి దాలినాయుడు, నాయకులు డి. అప్పలరాజు, గెద్దాడ అప్పలరాజు, శశిభూషణరావు, నల్ల శ్రీను, జనార్ధన్, చిత్రాడ బాలకృష్ణ, సూర్యనారాయణ, సురేష్‌రెడ్డి, ఎం. శ్రీనివాస్, ఎం. రామకృష్ణ, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోఆపరేటివ్ స్టోర్స్ మహాజన సభ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్ 59వ మహాజన సభ గురువారం నిర్వహించనున్నారు. సెక్టార్–1 స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు సభ ప్రారంభం కానుంది. అధ్యక్ష ఉపన్యాసం, మరణించిన సభ్యులకు సంతాప తీర్మానం, కార్యదర్శి నివేదిక అనంతరం 2025–26 వార్షిక బడ్జెట్ ధృవీకరణ, అంతర్గత ఆడిటర్ నియామకం వంటి అంశాలను అజెండాలో పొందుపర్చారు. సభ్యులు హాజరై సభను జయప్రదం చేయాలని స్టోర్స్ కార్యదర్శి ఆకుల నూకరాజు కోరారు.

ఇంటర్ స్టీల్ కబడ్డీ రన్నరప్‌గా విశాఖ స్టీల్‌ప్లాంట్



రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు క్రీడాకారులు

ఉక్కునగరం: జాతీయ ఇంటర్ స్టీల్ కబడ్డీ పోటీల రన్నరప్‌గా విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు నిలిచింది. స్టీల్ ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో రూర్కెలాలో ఈనెల 17 నుంచి 19 వరకు జాతీయ స్థాయి ఇంటర్ స్టీల్ కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తొమ్మిది స్టీల్ ప్లాంట్లకు చెందిన జట్లు పాల్గొన్నారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భిలాయ్ జట్టు 39–34 స్కోరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై గెలుపొందింది. ఈ సందర్భంగా జట్టు క్రీడాకారులు మొల్లి అప్పలరాజు (కెప్టెన్), ఉరుకూటి అప్పారావు, శివకుమార్, ఎం .సురేష్, ఐ.అప్పలరాజు, రాజాబాబు, తేజ, దుర్గాప్రసాద్, ప్రసాద్, హరీష్, హేమత్, మహేష్‌లను జట్టు మేనేజర్ సత్యం, కోచ్ దేముడు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ సామాజిక కార్యకర్తలపై కేసు

అక్కిరెడ్డిపాలెం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోను వైఎస్సార్ సీపీ సామాజిక కార్యకర్తలు మార్ఫింగ్ చేశారని జనసేన నాయకులు బుధవారం గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ త్రినాథ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఏసీపీ తెలిపారు.

డబ్బులు డిమాండ్ చేస్తున్నారని విలేకరిపై ఫిర్యాదు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక ఆఫీషియల్ కాలనీలో తమ సొంత స్థలంలో నిర్మాణాలు చేపడుతుండగా ఒక విలేకరి(సాక్షి కాదు) అది గెడ్డపోరంబోకు స్థలం అని ఇబ్బందులు పెడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బాధితులు గాజువాక పోలీసులను ఆశ్రయించారు. దీంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ పార్థసారథి తెలిపారు. వివరాలు.. నూనెల వెంకటలక్ష్మి అనే మహిళ ఆఫీషియల్ కాలనీలో 300 గజాల స్థలంలో నిర్మాణం చేపడుతోంది. అక్కడికి ఓ పేపర్‌కు చెందిన రాంబాబు అనే విలేకరి వెళ్లి నిర్మాణ స్థలం ప్రభుత్వ భూమి అని తనకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని పేర్కొన్నారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలని నిలదీస్తే నిర్మాణాలు కూలగొట్టిస్తానని బెదిరించాడని ఆరోపించారు. దీంతో సదరు విలేకరిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పార్థసారథి తెలిపారు.

నిరుపేదలకు నిత్యావసర సరకుల వితరణ



నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరకులు అందిస్తున్న పట్టా రామఅప్పారావు

అగనంపూడి: గ్రామదేవత ఉత్సవాలను పురస్కరించుకొని వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ పట్టా రామఅప్పారావు రెండు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించారు. జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస వాసుల ఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారి జాతరను పురస్కరించుకొని రామఅప్పారావు రెండు కుటుంబాలకు సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు వృథా ఖర్చు చేసి పొందే ఆనందం కంటే నిరుపేద కుటుంబాలకు బాసటగా నిలిస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుడే సుశీలా గజేంద్రరావు, ట్రస్ట్ చైర్మన్ మారా మస్తాన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ కిడిమి హనుమంతురావు, ట్రస్ట్ ప్రతినిధులు లక్కరాజు రాము, పల్లా లక్ష్మీ చంద్రకాంతం పాల్గొన్నారు.

ఆక్రమణ చెర నుంచి స్టీల్‌ప్లాంట్ భూమికి విముక్తి



స్టీల్‌ప్లాంట్ భూమిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు



ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన క్రికెట్ అకాడమీ బోర్డు

- కబ్జాదారుల చేతుల్లో సుమారు 90 సెంట్ల భూమి
- అందులో క్రికెట్ అకాడమీ ఏర్పాటు
- కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు
- స్పందించిన స్టీల్‌ప్లాంట్ అధికారులు
- భూమిని స్వాధీనం చేసుకొని మొక్కలు నాటిన వైనం

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ అధికారులు స్పందించారు.. కబ్జాదారుల చేతుల్లో చిక్కుకున్న సుమారు 90 సెంట్లు భూమికి విముక్తి కల్పించారు. అందులో అక్రమంగా నిర్మించిన క్రికెట్ అకాడమీ కట్టడాలను తొలగించారు. ఆపై అందులో మొక్కలు నాటారు. ఈ భూ ఆక్రమణకు సంబంధించి వివరాల ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట సమీపంలోని నడుపూరు గ్రామం సర్వే నెంబర్ 232లో స్టీల్ ప్లాంట్‌కు చెందిన భూమి ఉంది. ఆ స్థలాన్ని ఓ వ్యక్తి ఇటీవల ఆక్రమించాడు. ఆ భూమిలో ఉన్న లక్షలాది రూపాయల విలువైన చెట్లను నరికించేశాడు. భూమిని చక్కగా చదును చేయించాడు. ఆ స్థలాన్ని క్రీడామైదానంగా తీర్చిదిద్దాడు. అందులో క్రికెట్ అకాడమీ నెలకొల్పాడు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న తతంగంపై స్థానికులు పెద్ద ఎత్తున స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో స్పందించిన స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులు ఆ భూమిని పరిశీలించారు. సర్వే చేసి ఆ భూమి స్టీల్‌ప్లాంట్‌కు చెందినదిగా నిర్ధారించుకున్నారు. తర్వాత అక్కడ సర్వే రాళ్లు పాతించారు. ఆపై అక్కడ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ అధికారులు బాలరాజు, వెంకటేష్, మంత్రి నర్సింహమూర్తి, భాస్కర్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు చెందిన భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ ఈ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సర్వేయర్లు, పెదగంట్యాడ మండల రెవెన్యూ సర్వేయర్లు, దువ్వాడ పోలీసులు పాల్గొన్నారు.

కొలువులకు 78 మంది ఎంపిక



నియామక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సంస్థ ప్రతినిధులు

పెదగంట్యాడ: యువతకు ఉపాధి కల్పించేందుకు నాలుగు ఎంఎన్‌సీ కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు సుమారు 141 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వీల్స్ ఇండియా లిమిటెడ్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా కంపెనీలకు అవసరమైన 78 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికై న వారికి రూ.10వేల744 నుంచి రూ.27వేల వరకూ జీతం ఇవ్వనున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారులు పి. శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.